క్లుప్తంగా

వైభవంగా కోదండ రామలింగేశ్వరస్వామి పరస


పరసలో విక్రయిస్తున్న వస్తువులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు నక్కవాని పాలెంలో ఆదివారం సాయంత్రం కోదండ రామలింగేశ్వరస్వామి పరస వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, 59వ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, నాయకులు ఎస్‌కే ఖాన్, పైడితల్లి, బంగార్రాజు, రోహిణి, పరస కమిటీ సభ్యులు దాకారపు నూకరాజుతో పాటు నక్కవానిపాలెం చుట్టుపక్కల నివాసీయులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయం నుంచి డిపో సమీపంలోని సాయిబాబా ఆలయం వరకు వివిధ వ్యాపారులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. రంగులరాట్నం, మ్యూజికల్ చైర్స్, స్పీడ్ కారు వంటి ఆట పరికరాల వద్ద చిన్నారులు సందడి చేశారు.

రేపు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

పెందుర్తి: స్కిల్ డెవెలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో పలు ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి నిమిత్తం మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల్లో 250 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ ఉత్తీర్ణత కలిగి, 18–35 ఏళ్ల మధ్య వయస్సువారు. ఇంటర్వ్యూలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 77025 06614 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

పరమపదవాసునిగా అప్పన్న

ముగిసిన రాపత్తు ఉత్సవాలు


పరమపదవాసునిగా అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవంలో భాగంగా ఆలయంలో పరమపదోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పరమపదవాసునిగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా ఆలయ ఆస్థాన మండపంలో కొలువుంచి, ద్వాదశి ఆరాధనలతో కొలిచారు. సింహగిరి మాడ వీధిలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. విశేష హారతులు అందించారు.

అల్లర్లు సృష్టిస్తే రౌడీషీటర్లపై కఠిన చర్యలు

సీతమ్మధార : అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తప్పవని ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ సీఐ ఆత్మకూరు సత్యనారాయణ హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి నుంచి వేలి ముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై నిఘా పెట్టామని తెలిపారు. మద్యం సేవించి షాపులు వద్ద అల్లరి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న వారిపై సీరియస్ అయ్యారు. మంచిగా ఉంటే మంచిగా ఉంటామని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మర్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీయిజం చేసినా, అల్లర్లు సృష్టించినా ఊరుకునేది లేదని సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం తాగి గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అనంతరం వారి నుంచి వేలి ముద్రలు, సంతకాలు సేకరించారు.

గెడ్డలను మింగేస్తున్నారు!

నిర్మాణాలతో కనుమరుగవుతున్న వైనం
మరికొన్ని కాలువలుగా ..
కన్నెత్తి చూడని అధికారులు • భారీ వర్షాలు వస్తే ముప్పే..


అచ్చినాయుడులోవ ప్రాంతంలో గెడ్డపై సామగ్రి, పేరుకుపోయిన వ్యర్థాలు

మల్కాపురం: విశాలమైన గెడ్డలు నేడు కాలువలుగా మారుతున్నాయి.గెడ్డలకు ఆనుకుని ఉన్న నివాసీయులు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. దీంతో కొన్ని నామరూపాల్లేకుండా పోతున్నాయి. మరికొన్ని చిన్న కాలువలుగా మారుతున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు.ఫలితంగా భారీ వర్షాలు కురిసేటప్పుడు వరదనీరు పోటెత్తుతోంది. ప్రజలు అవస్థలకు గురవుతున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 61వ వార్డు పరిధి అచ్చినాయుడులోవ,జనతాకాలనీ శివారు ప్రాంతాల్లో కొండలు ఉన్నాయి. భారీ వర్షాలు వచ్చేటప్పుడు కొండ ప్రాంతంతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వాడుక, వర్షపు నీరు దిగువ ప్రాంతాల్లో చేరి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తేవి. ఈ సమస్యకు చెక్ పెట్టేలా అధికారులు సుమారు 20 ఏళ్ల కిందట అచ్చినాయుడులోవ,జనతాకాలనీ కొండ ప్రాంతాల నుంచి దిగువన ఉన్న అంబేడ్కర్‌కాలనీ,ప్రకాష్‌నగర్,గాంధీజీవీధి,మల్కాపురం మీదుగా హెచ్‌పీసీఎల్ రక్షణ గోడ దిగువ నుంచి సముద్రంలో కలిసే విధంగా సుమారు 10 అడుగుల వెడల్పుతో కాంక్రీట్‌తో గెడ్డలను నిర్మించారు. దీంతో ఎలాంటి వర్షాలు వచ్చిన దిగువ ప్రాంతాలకు ఇబ్బంది ఉండేది కాదు. అయితే ఆ గెడ్డలను నేడు కొంత మంది ఆక్రమించేస్తున్నారు.మరి కొంత మంది దర్జాగా వంతెనలు వేసుకుని ఎంజాయ్ చేస్తున్నారు. దీనికి తోడు గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలను నెలల తరబడి తొలగించడం లేదు. మరి కొన్ని చోట్ల పిచ్చి మొక్కలు పెరిగి గెడ్డలోకి వెళ్లలేని పరిస్థితి. మరో చోట గెడ్డపై భవన నిర్మాణ,స్టేజ్ సామగ్రి వేసి సొంత అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇదే పరిస్థితి ఉంటే భవిష్యత్‌లో గెడ్డలు అంతరించి పోతాయని ఆయా కాలనీల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


61వ వార్డు అంబేడ్కర్‌కాలనీ వద్ద ఆక్రమణకు గురవుతున్న గెడ్డ


ప్రకాష్‌నగర్ గెడ్డపై ప్రైవేట్ వ్యక్తులు వేసిన వంతెన


జనతాకాలనీ శివారు ప్రాంతంలో కాలువగా మారిన గెడ్డ

అప్రమత్తం కాకుంటే ముప్పే..

భారీ వర్షాలు వచ్చేటప్పుడు ఎగువ, కొండ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు దిగువ ప్రాంతాల్లో చేరి ముంపు సమస్య తలెత్తకుండా ముందు చూపుతో అప్పట్లో గెడ్డలు నిర్మించారు. అయితే భూములు ధరలకు రెక్కలు రావడంతో అవి నేడు ఆక్రమణలతో కుదించుకుపోతున్నాయి. భవిష్యత్‌లో ఇవి అంతరించిపోయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదంటే అతిశయోక్తి కాదు.

ఆక్రమణల బెడద

జనతాకాలనీ శివారు ప్రాంతంలో గెడ్డ విశాలంగా ఉండేది.నేడు అది కాలువగా మారింది. దీనికి కారణం గెడ్డకు ఆనుకుని ఉన్న నివాసీయులు గెడ్డ ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడమే. అధికారులు ఇప్పటికైన మౌనం వీడాలి.లేకుంటే భవిష్యత్‌లో గెడ్డ అన్నది కనిపించదు.
– నర్సింగరావు, జనతాకాలనీ

అధికారులు స్పందించాలి

ప్రకాష్‌నగర్,అంబేడ్కర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో గెడ్డలు కుదించుకుపోతున్నాయి.గెడ్డలపై నిర్మాణాలు చేస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదు.ఇదే రీతిలో గెడ్డలు ఆక్రమణ జరిగితే భవిష్యత్‌లో భారీ వర్షాలకు దిగువ ప్రాంతాలు ముంపునకు గురవుతాయి.
– గోవిందరావు, మల్కాపురం

ముం 'చెత్త'గా..

61వ వార్డులో అపారిశుద్ధ్యం


ఇండస్ట్రియల్‌కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల సమీపంలో ఇలా..


ఆర్‌కేపురం పాత పెట్రోల్ బంక్ వద్ద వ్యర్థాలు

మల్కాపురం: జీవీఎంపీ 61వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో అపారిశుధ్యం నెలకుంది. సర్వీసు రోడ్ల వెంబడి వ్యర్థాలు పేరుకుపోయాయి. వాటిపై పందులు, మూగజీవాలు చేరి పరిసరాలను మరింత అపరిశుభ్రం చేస్తున్నాయి. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానిక వాసులు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

ఆర్‌కేపురం పాతపెట్రోల్ బంక్ ఎదురుగా గల సేవా మార్గంలో వ్యర్థాలను డంప్ చేయడానికి డస్ట్‌బిన్ ఏర్పాటు చేశారు. అయితే ఆ బిన్ నిండిపోయి వ్యర్థాలు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. ఆదివారం ఉదయం 11 గంటల సమయం వ్యర్థాలపై పశువులు చేరి పరిసరాలను మరింత అపరిశుభ్రం చేస్తున్నాయి. ఇదే వార్డు పరిధి ఇండస్ట్రియల్‌కాలనీ రామాలయం దరి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల రక్షణ గోడ సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. సమస్యపై ఉన్నతాధికారులు స్పందించాలని ఆయా ప్రాంత వాసులు కోరుతున్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం


ఏఐవైఎఫ్ పతాకావిష్కరణ చేస్తున్న ప్రతినిధులు

పెందుర్తి: కేంద్ర ప్రభుత్వం నిరుపేదల బతుకులపై భారం మోపి, కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు విమర్శించారు. ఏఐవైఎఫ్ విశాఖ జిల్లా నిర్మాణ మహాసభ ఆదివారం పెందుర్తిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ దేశ సంపదను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నాయన్నారు. యువతకు 2 కోట్ల ఉద్యోగాలని మభ్యపెట్టి గద్దెనెక్కిన ప్రధానమంత్రి మోదీ, యువతను దారుణంగా మోసం చేశారని ఆరోపించారు. దేశ జీడీపీ వృద్ధిరేటు క్షీణిస్తున్నా తప్పుడు ప్రచారాలతో దేశం అభివృద్ధి చెందిందని ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. వచ్చే నెల 6, 7, 8, 9 తేదీల్లో శ్రీకాకుళంలో తలపెట్టిన ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల్లో దేశం, రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక పాలన, యువతకు జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తనున్నట్లు ప్రకటించారు. మహాసభలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా ఏఐవైఎఫ్ పతాకావిష్కరణ చేశారు. సంఘం నేతలు ఎస్.క్షేత్రపాల్‌రెడ్డి, కె.అచ్యుత్, వై.రాంబాబు, కె.సందీప్, యు.నాగరాజు, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక్ సంపర్క్ అభియాన్ కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం విడుదల చేస్తున్న బీఎంఎస్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)70వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు రొక్కం సురేష్ కుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎంవీఎస్ నాయుడు తెలిపారు. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో శ్రామిక సంపర్క్ అభిమాన్ పేరుతో లక్ష కుటుంబాలను కలిసి బీఎంఎస్ విశిష్టతను తెలిపేలా రూపొందించిన కరపత్రాన్ని ఆదివారం భెల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ కర్మాగారంలో కార్మిక కుటుంబాలకు చేరువకావాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం రూపొందించామన్నారు. బీఎంఎస్ కార్మిక సంఘంగా మాత్రమే కాకుండా సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, సామాజిక సామరస్యత, ఆర్థిక స్వావలంబన వంటి అంశాల్లో ప్రజల్లో చైతన్యం తెచ్చే విధంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి లోవరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి లాలం ప్రసాద్, జిల్లా కార్యదర్శి శరగడం రామచంద్రశేఖర్, వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం


యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

సెయిల్‌లో విలీనం చేయాల్సిందే..


అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేసి ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, వి.శ్రీనివాసరావు కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నేతృత్వంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన 1438వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. బ్యాంక్‌లకు సర్దుబాటు, జీఎస్టీ, ఓవర్‌డ్రాఫ్ట్ మినహాయిస్తే ఉత్పత్తి సాధారణ స్థితికి ఎలా వస్తుందని, నేటికీ జీతాలు చెల్లించకపోవడం, జీతాల బకాయిలు ఊసెత్తకపోవడం కేవలం కంటితుడుపు చర్యగా కేంద్ర ప్రభుత్వ తీరు ఉందన్నారు. మంజూరు చేసిన నిధులు సర్దుబాటు కాదని, ప్రైవేటు పరం చేయడానికి సర్దుపోటుగా అభివర్ణించారు. సర్దుబాటు చేసినా ఉక్కు కోలుకోలేదని, జీతాలు చెల్లించలేదనే కారణం చూపించి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడమే ప్రభుత్వ లక్ష్యంగా కనపడుతుందని ఆరోపించారు. బలవంతపు వీఆర్ఎస్ ద్వారా ఇప్పటికే 500 మందికి పైగా వెళ్లిపోయారని, భయభ్రాంతులకు గురై 750 మంది ఉద్యోగాలు వదిలి వెళ్లిపోయారని, . 7500 ఖాళీలు ఉన్నాయని, అయినా మరో వెయ్యి మందిని బయటకు పంపేందుకు కుట్రలు చేస్తున్నారంటే పాలకుల వైఖరి అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్.రామచంద్రరావు, కె.ఎస్.ఎన్.రావు, బిఎస్‌రాజు, రమణమూర్తి, యు.రామస్వామి, రమణారెడ్డి, సురేష్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పౌరాణిక కళాకారులకు సత్కారం


కళాకారులను సత్కరిస్తున్న కార్పొరేటర్లు

అగనంపూడి: సినీ వజ్రోత్సవాలను పురస్కరించుకొని 86వ వార్డు కూర్మన్నపాలెం రామాలయం వద్ద గాజువాక పద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సీనియర్ పౌరాణిక కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లేళ్ల కోటేశ్వరరావు, బొండా జగన్నాథం, రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలు పాల్గొని 20 మంది కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని వివిధ రూపాల్లో చాటిచెప్పే కళాకారులను సత్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గాజువాక పద్య పౌరాణిక కళాకారుడు, నంది అవార్డు గ్రహీత కురిటి సత్యంనాయుడు మాట్లాడుతూ కళాకారులు ఎంత పేదరికంలో ఉన్నా వారు పోషించే పాత్రల్లో లీనమై కళలను బతికించడానికి పాటుపడుతున్నారన్నారు. అటువంటి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కర్రి ఈశ్వరరావు, కాదా శ్రీను, సంఘ ప్రధాన కార్యదర్శి కట్టా పైడిరాజు, కళాకారులు వెంకటరమణ, కొత్తూరు శివ ప్రసాద్, వింజలు వరహాలు, బలిరెడ్డి సత్యనారాయణ, అల్లాడి సత్తిబాబు, నానాజీ, అరికట్ల ఆచారి, బీఎస్‌నాయుడు, చిన్ని రాము, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ములాఖత్‌కు వెళ్లే వారు నిబంధనలు పాటించాలి



కేంద్ర కారాగారం ద్వారం వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

ఆరిలోవ : కారాగారంలో ఖైదీలను కలవడానికి ములాఖత్ కోసం వెళ్లే వారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జైల్ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు విశాఖ కేంద్ర కారాగారం అధికారులు నియమ నిబంధనలతో కూడిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. లోపల ఉన్న ఖైదీలకు నిషేధిత వస్తువులు అందించకూడదని అందులో పేర్కొన్నారు. ఇంకా ఏం చెప్పారంటే...

- కేంద్ర హోం శాఖ నిబంధనల ప్రకారం ఖైదీని కలవడానికి ములాఖత్ కోసం వెళ్లే వారు ఆధార్ కార్డు చూపించాలి. దరఖాస్తుకు ఆధార్ కార్డు జెరాక్స్ జత చేయాలి.
- ఒక ముద్దాయితో మాట్లాడడానికి చిన్న పిల్లలకు మినహా ఒకసారి ముగ్గురికి మాత్రమే అవకాశం ఉంటుంది.
- వారానికి రెండుసార్లు మాత్రమే ములాఖత్ ఉంటుంది.
- ముద్దాయితో మాట్లాడుతున్న సమయంలో ములాఖత్‌కు వెళ్లే వారి వద్ద ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు ఉండకూడదు.
- ఖైదీలకు నేరుగా నగదు ఇవ్వకూడదు. జైల్ గేటు వద్ద సిబ్బందికి డబ్బులు ఇస్తే ఆ ఖైదీ ఖాతాలో జమ చేస్తారు.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

నిషేధిత వస్తువులు జైలు లోపలకు వెళ్లనీయకుండా చర్యలు చేపడుతున్నామని జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపారు. ఇందులో భాగంగా ఖైదీలను కలవడానికి ములాఖత్ కోసం వచ్చిన వారి బంధువులు, స్నేహితులు నిషేధిత వస్తువులు ఇవ్వకూడదని తెలియజేస్తూ ప్రకటన బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.

మహిళల రక్షణకు పింక్ ఆర్మీ సేవలు


పింక్ ఆర్మీని ప్రారంభిస్తున్న నాదెళ్ల జ్యోతి, టాటర్ జైన్

సీతంపేట : గ్లోబల్ పింక్ ఆర్మీ విశాఖ శాఖను ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ గ్లోబల్ పింక్ ఆర్మీని సింధు మంగళవేద స్థాపించారని తెలిపారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో సేవలందిస్తున్నట్టు తెలిపారు. మహిళలు తమను తాము ఎలా రక్షించుకోవాలి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పింక్ ఆర్మీ అవగాహన కల్పిస్తుందన్నారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు కళాశాల ప్రాంగణాల్లో మహిళల భద్రతకు, హింసను నివారించేందుకు చట్టపరంగా ఉన్న అవకాశాలను వివరిస్తూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ బీజేపీ కార్యదర్శి నాదెళ్ల జ్యోతి, గ్లోబల్ పింక్ సహ వ్యవస్థాపకుడు దీకప్ టాటర్ జైన్, రేంజర్ ఫోర్స్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ శిడగం నాగేంద్రబాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ కె.నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా గోబ్యాక్


జీవీఎంసీ గాంధీ పార్కులో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

సీతమ్మధార: భారత రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటన నుండి వెనక్కి పోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. 19న రాష్ట్రవ్యాప్త నిరసనలకు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చిన నేపథ్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ), సీపీఐ ఎంఎల్ ప్రజాపోరు పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు జి.ఎస్.అచ్యుతరావు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, ప్రజాపోరు జిల్లా కార్యదర్శి దేవాలు మాట్లాడారు. 75వ రాజ్యాంగ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో ప్రతిపక్ష పార్టీలు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి సవరణలు చేసేందుకు పూనుకోవడం, రాజ్యాంగ హక్కులను హరించడం సరైంది కాదని నినదించడంతో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అభిమానించే వారిని ఎగతాళి చేస్తూ మాట్లాడారన్నారు. అంబేడ్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందని, ఆయన జపం కన్నా దేవుడిని తలచుకుంటే స్వర్గమన్నా వచ్చేదంటూ వ్యాఖ్యానించడం దురదృష్టకరమన్నారు. ప్రధాని కూడా అమిత్‌షాను వెనకేసుకు రావడం దేశానికే అవమానకరమన్నారు. దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా బీజేపీ వైఖరిలో మార్పులేదని దుయ్యబట్టారు. రాజ్యంగంపై ప్రమాణం చేసి పదవి చేపట్టిన మతోన్మాదులకు అంబేడ్కర్ అంటే ఎందుకంత భయం అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని తరగతులు, వర్గాల ప్రజానీకం, సామాజిక, ప్రజాసంఘాలు కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టినా చంద్రబాబు, పవన్ కల్యాణ్, కూటమి పెద్దలు ఏమాత్రం నోరు మెదపకపోగా విజయవాడకు వచ్చిన అమిత్‌షాకు స్వాగతం పలకడం సరైంది కాదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు దళితుల పట్ల, రాజ్యాంగ విలువల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. తక్షణమే అమిత్‌షాను ఏపీ నుండి వెనక్కి పంపాలని, రాష్ట్రంలో పర్యటనలకు అనుమతించరాదని డిమాండ్ చేశారు. బి.పద్మ, బొట్టా ఈశ్వరమ్మ, డి.అప్పలరాజు, కుమార్, ఎం.సుబ్బారావు, వై.రాజు, మాధవి, కె.కుమారి, చంద్రశేఖర్, రెహ్మాన్, బేగం తదితరులు పాల్గొన్నారు.